క్లుప్తంగా

ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రవీంద్రారెడ్డి



ధర్మవరం అర్బన్: ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ధర్మవరం పట్టణానికి చెందిన సానే రవీంద్రా రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కొత్తచెరువులో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రవీంద్రారెడ్డిని ఏపీటీఎఫ్ ధర్మవరం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జగదీష్ , ఉపాధ్యాయులు అభినందించారు.

కేశాపురంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



డ్రోన్ పనితీరును వివరిస్తున్న అధికారులు

కొత్తచెరువు: మండల పరిధిలోని కేశాపురం గ్రామంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాలపై అవగాహన కల్పించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా ఆధునిక సాంకేతికత, డ్రోన్ల పనితీరును ఆ గ్రామ సర్పంచ్ నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు వివరించారు. సమయం, పెట్టుబడి ఖర్చులను తగ్గించేలా డ్రోన్‌లు ఉపకరిస్తాయని తెలిపారు. డ్రోన్లను సబ్సిడీపై పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు ప్రసాద్, ధనుంజయ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



సంజీవ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి

కనగానపల్లి: మండలంలోని చంద్రాచర్లలో అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిజన బాణం సంజీవ్ (48) శనివారం మృతి చెందాడు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి చంద్రాచర్లకు వెళ్లి మృతుడికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం చంద్రాచర్ల గ్రామంలోనే వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరో కుటుంబాన్ని పరామర్శించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, స్థానిక నాయకులు రామాంజనేములు, శివారెడ్డి, మురళీ, ప్రణీల్‌రెడ్డి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



రామ ప్రసాద్‌రెడ్డి (ఫైల్)

కదిరి టౌన్: మండలం వీరేపల్లిపేటకు చెందిన రైతు రామప్రసాద్‌రెడ్డి (40) శుక్రవారం అర్ధ రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. రామప్రసాద్‌రెడ్డి తనకున్న పొలంలో పంటల సాగుకు దాదాపు రూ.12 లక్షల వరకూ అప్పులు చేశాడు. పంటలు సకాలంలో చేతికి రాక తీసుకున్న అప్పులు ఎలా తీర్చాలో మన స్థాపానికి గురయ్యేవాడు. శుక్రవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు నిద్రపోయాక తన ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. శనివారం ఉదయం ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు డోర్ తెరచి చూశారు. అప్పటికే రామ ప్రసాద్‌రెడ్డి ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూరల్ సీఐ సూర్య నారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

పరామర్శ..

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ఆసుపత్రికి వెళ్లి రామప్రసాద్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

శివాలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న ఉపాధ్యాయ దంపతులు

కొత్తచెరువు: మండల పరిధిలోని వంగంపల్లి గ్రామంలో శివాలయ నిర్మాణానికి ఉపాధ్యాయ దంపతులు గోపి, నాగమణి రూ.35 వేల విరాళాన్ని శనివారం ఆలయ పూజారి మాధవ రాజుకు అందజేశారు. వంగంపల్లి పాఠశాలలో గోపి ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ నగదుతో పాటు మరో రూ.10 వేలను దాతలతో సహకారంలో అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అభివృద్ధి చేసి చూపించాం

- మళ్లీ జగనన్నను ఆశీర్వదించండి
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందరికీ అందించి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించాం. మరొక్కసారి జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కోరారు. శనివారం మండలంలోని గొనికుంట పల్లి, బైరాపురం, సాయినగర్ క్రాస్, ఓబుళదేవరపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. తొలుత ఆయా గ్రామాల్లోకి వెళ్లిన ఎమ్మెల్యే దుద్దుకుంటకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరుగుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు అందని లబ్ధిదారులు ఎవరైనా ఉన్నారా? అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకెళ్లారు. రాష్ట్ర సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుకెళ్తున్నారని తెలిపారు. దేశ చరిత్రలో ఇన్ని పథకాలు ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. పక్క రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నారంటే జగనన్న పాలన ఏ విధంగా ఉందో స్పష్టం అవుతోందన్నారు. తనను పుట్టపర్తి నియోజకవర్గంలో గెలిపించినందుకు రుణపడి ఉంటున్నానని తెలిపారు. పుట్టపర్తిని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తచెరువు మండలంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలతో



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

పాటు ఇళ్లు కూడా మంజూరు చేసి పేదలకు గూడు కల్పించామన్నారు. అంతేకాక పార్టీలకు అతీతంగా అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేస్తున్నామన్నారు.

టీడీపీని నమ్మొద్దు..

గత టీడీపీ హయాంలో వారి అనుచరులకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందినట్లు తెలిపారు. ఎంతో మంది నిరుపేదలను దగా చేసిన టీడీపీ ప్రభుత్వం మీకు కావాలా? అని ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రధాన రహదారులు వేయడంతో నేడు ప్రతి గ్రామానికి ప్రజలు సౌకర్యవంతంగా రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఇంతకంటే అభివృద్ధి ఎవరు చేస్తారన్నారు. నేడు పుట్టపర్తి నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఫోర్‌లేన్ డబుల్ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో రైతుల వ్యవసాయ భూముల ధరలు ఎంతో పెరిగాయన్నారు. మళ్లీ రాష్ట్ర ప్రజలను దగా చేసేందుకు టీడీపీ వారు వస్తున్నారని, ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఇంత అభివృద్ధి చేసిన జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుని రాష్ట్రాన్ని సుభిక్షం చేసుకోవాలని దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారేపల్లి జగన్మోహన్ రెడ్డి, నాయకుడు మటన్ శంకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పుట్టపర్తి ఎంపీపీ పెడపల్లి రమణారెడ్డి, మాజీ సర్పంచులు శివారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గంగరాజు, లింగారెడ్డి, క్రిష్టారెడ్డి, అశోక్ రెడ్డి, పోతన్న, నారాయణ స్వామి, షణ్ముఖానంద రెడ్డి, సూర్యవర్ధన్ రెడ్డి, కులశేఖర్ రెడ్డి, శాంసుందర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, మున్వర్, పెయింటర్ కేశవ, సుబ్బారావు, గిరి, చంద్ర, ఆవుల అశోక్, రామచంద్ర, ప్రభావతమ్మ, వెంకటరాముడు, బోయ యల్లప్ప, తహసీల్దార్ రామాంజనేయులు రెడ్డి, ఈఓపీఆర్డీ సిద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శభాష్ బుడ్డోడా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన మౌలిక సదుపాయాలపై ఓ విద్యార్థి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఎదుట అనర్గళంగా ప్రసంగించి అదరగొట్టాడు. ప్రభుత్వ బడుల్లో కూర్చోవడానికి బల్లలు, వేసుకోవడానికి యూనిఫాం, చదువుకోవడానికి పుస్తకాలు, డిజిటల్ ట్యాబులు, ఇలా ఎన్నోరకాల సౌకర్యాలను కల్పించారని తెలిపాడు. గతంలో ఎప్పుడైనా ప్రభుత్వ బడుల్లో ఇలాంటి సౌకర్యాలు ఉన్నాయా? అని ఎమ్మెల్యే విద్యార్థిని అడిగారు. ఇందుకు స్పందించిన విద్యార్థి.. తామెప్పుడూ చూడలేదని సమాధానం ఇచ్చాడు. జగనన్న ముఖ్యమంత్రిగా మాకు చదువుకోవడానికి ఇంతటి సౌకర్యాలు కల్పించడం సంతోషంగా ఉందన్నాడు. దీంతో అక్కడున్న ఎమ్మెల్యే దుద్దుకుంట, అధికారులు, నాయకులు, ప్రజలు విద్యార్థిని శభాష్ బుడ్డోడా.. అంటూ మెచ్చుకున్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

నల్లమాడ: గోపేపల్లి సచివాలయం పరిధిలోని గోపేపల్లి, గోపేపల్లి తండా, రాగానిపల్లి, రాగానిపల్లి తండాల్లో ఆదివారం ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం జరగనుంది. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ రోహిణి, నాయకుడు ముక్తాపురం రమణారెడ్డి కోరారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

అమడగూరు: మండలంలోని తుమ్మల, కొట్టువారిపల్లి గ్రామ పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ప్రజాప్రతినిధులు శనివారం పరిశీలించారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. త్వరగా ఇళ్లు నిర్మించుకుని, బిల్లులను పొందాలన్నారు. వారి దృష్టికి వచ్చిన పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శేషూరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, పార్టీ పరిశీలకుడు డాక్టర్ సురేష్, పాల్గొన్నారు.

వెండి గొడుగు వితరణ

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో భజన, అన్నదానానికి పులివెందులకు చెందిన భూమిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.10 వేలను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌కు అందజేశారు. కొట్టాల గ్రామానికి చెందిన ఎం.చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు స్వామికి వెండి గొడుగు బహుకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామాంజనేయులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహావిష్కరణ



వాల్మీకి విగ్రహావిష్కరణలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



అన్నదానం చేస్తున్న సర్పంచ్ అంగజాల నాగవేణి దంపతులు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతుకుంట ఇందిరమ్మ కాలనీలో శనివారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వాల్మీకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు అంగజాల నాగవేణి, అంగజాల రాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నులక రామయ్య, పుల్లన్న, జయరాం, వెంకటేష్, మంజు, చంద్ర, విష్ణు, శివ, రామాంజనేయులు, నాగభూషణ, ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



ఇరువర్గాలను రాజీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

ధర్మవరం అర్బన్: రాజీమార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్య సాయి తెలిపారు. పట్టణంలోని కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో అన్ని వర్గాల వారికి న్యాయం చేయడమే లక్ష్యమన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 332 కేసులు పరిష్కారం అయ్యాయి. 4 విడాకుల కేసులు, 47 బ్యాంకు రుణాల కేసులు (రూ.2,19,110) 3 సివిల్ కేసులు (రూ.17,140) 2 చెక్‌బౌన్స్ కేసులు (రూ.1,49,726) 53 తగాదాల కేసులు, 52 ఎక్సైజ్ కేసులు, 163 పెట్టి కేసులు (రూ.1,36,990), 8 ఇసుక రవాణా కేసులు మొత్తం 332 కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించారు.

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు.ఐపీసీ కేసులు 120, ఎస్టీసీ 48, బ్యాంక్ పీఎల్‌సీ 09, ఎక్సైజ్ 20 కలిపి మొత్తం 197 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగిరెడ్డి పాల్గొన్నారు.



కదిరి: ఖాద్రీశుడి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

భక్తులతో ఖాద్రీ కిటకిట

కదిరి టౌన్: కార్తీక మాసం సందర్భంగా శనివారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు వేలాదిగా తరలివచ్చి దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు.

అయ్యప్ప స్వామికి పూజలు

తాడిమర్రి: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం నాలుగో శనివారం సందర్భంగా గురుస్వాములు సత్యనారాయణ, నారాయణస్వామి తదితరులు అయ్యప్ప చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించారు. అనంతరం స్వామికి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే స్థానిక చెన్నకేశ్వస్వామి ఆలయం, ఏకపాదంపల్లి, నార్శింపల్లి గ్రామాల్లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి.



తాడిమర్రి: అలంకరణలో అయ్యప్ప స్వామి



కదిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

'సీఎంఆర్‌ఎఫ్'తో పేదలకు భరోసా



సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ఎన్పీకుంట/తలుపుల/కదిరి టౌన్: ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొందలేని రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కోట్లాది రూపాయలు అందించి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆర్థికంగా ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం కదిరిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.7.97 లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అందులో ఎన్పీకుంట మండల పరిధిలోని పి.కొత్తపల్లికి చెందిన చిన్నకోట్ల శివపార్వతికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.1.60 లక్షల చెక్కు అందజేశారు. చిన్నకోట్ల హేమేశ్వర కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ 8 నెలల క్రితం మృతి చెందాడు. ఎమ్మెల్యే చొరవతో బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కును మృతుడి భార్య చిన్నకోట్ల శివపార్వతికి అందజేశారు. అలాగే తలుపుల మండలం అగ్రహారంపల్లికి చెందిన ఎం.రామిరెడ్డికి రూ.1.20 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తరంగారెడ్డి, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, ఉప సర్పంచులు సామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగారెడ్డి, లింగాల మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాల సందడి



భోజనాలు వండుతున్న దృశ్యం

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తికి చెందిన సాయి గీతా స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది శనివారం కార్తీక మాస వనభోజనాలు నిర్వహించారు. అమగొండపాళ్యం అటవీ ప్రాంతంలో వంటా వార్పు చేసుకుని భోజనాలు ఆరగించారు. ఆటవిడుపుగా పాటలు పాడుతూ అలరించారు. కరస్పాండెంట్, మున్సిపల్ విప్ సాయిగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుపానుతో రైతులకు అవస్థలు

బత్తలపల్లి: మండలంలో తుపాన్ దెబ్బకు రైతులు అల్లాడిపోతున్నారు. గరిశలపల్లి, ఉప్పర్లపల్లి, దంపెట్ల, నల్లబోయనపల్లి, ఓబుళాపురం, రామాపురం, జలాలపురం తదితర గ్రామాలలో వరి పంట ఈదురు గాలుల ధాటికి నేలకొరిగింది. శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోకుండా ప్లాస్టిక్ పట్టలతో కప్పుతూ పంటలను కాపాడుకుంటున్నారు. చలి తీవ్రతతో పాటు ఈదురు గాలులు వీస్తుండటంతో వాహనదారులు, ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

కదిరి టౌన్: అన్నమయ్య జిల్లా పులివెందులకు చెందిన పవన్ కళ్యాణ్, తన స్నేహితుడు కిరణ్‌కుమార్, పట్టణానికి చెందిన మరో ముగ్గురిపై కేసు నమోదైంది. వివరాలు.. పవన్ కళ్యాణ్, కిరణ్‌కుమార్ ఇద్దరూ కలిసి బెంగళూరులో కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పట్టణంలో కొంతమందితో డబ్బులు తీసుకున్నారు. సదరు కంపెనీ డిసెంబర్ 2022 సంవత్సరంలో మూసివేయడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ కదిరి పట్టణానికి చెందిన కొంతమంది డిమాండ్ చేశారు. ఈ విషయంపై మాట్లాడేందుకు పవన్ కళ్యాణ్, కిరణ్‌కుమార్‌ను బెంగళూరు నుంచి పులివెందులకు కారులో తీసుకెళ్తుండగా.. బంధువుల ఫిర్యాదుతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డబ్బు విషయంలో గొడవ జరగడంతో 5 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

గేట్ల ఏర్పాటుకు విరాళం



దాత సిద్ధి రాజేష్‌ను అభినందిస్తున్న డీసీవీసీ సభ్యులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి గేట్లు ఏర్పాటు చేసేందుకు దాత, చేనేత ప్రముఖుడు సిద్ధి రాజేష్ రూ.20 వేల విరాళం అందించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ మైదాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గేట్ల ఏర్పాటుకు విరాళం అందించిన సిద్ధి రాజేష్‌ను క్రీడాకారులు అభినందించారు. కార్యక్రమంలో డీసీవీసీ గౌరవాధ్యక్షుడు గోరకాటి పెద్దారెడ్డి, కౌన్సిలర్ గజ్జల శివ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉడుముల రాము పాల్గొన్నారు.

నేడు పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని పాతవూరులో నూతనంగా నిర్మించిన పిరమిడ్ ధ్యాన మందిరాన్ని బ్రహ్మర్షి గోపాల్‌రెడ్డి ఆదివారం ప్రారంభిస్తారని హరిహర ధ్యాన కేంద్రం కమిటీ సభ్యులు మదనాపు కొండన్న, నెట్టెం నాయుడు, గోపాల్, నాగేంద్ర తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి శాఖాహార ర్యాలీతో ధ్యాన మందిరానికి చేరుకుంటామన్నారు. అనంతరం మందిరాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

ధర్మవరం: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటం ముందు కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సోనియాగాంధీ దేశానికి విశిష్టమైన సేవలందించారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగన అశ్వర్థనారాయణ కొనియాడారు.

నేడు ఆరాధనోత్సవాలు

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతం సమీపంలోని మహాగణపతి, అన్నపూర్ణేశ్వరి, లక్ష్మీనరసింహ సమేత కాశీనాయన ఆశ్రమంలో ఆదివారం 28వ ఆరాధన ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం రాత్రికి కాశీనాయన ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. గోపూజ, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా రాత్రి 8 గంటలకు మాల్యవంతం గ్రామంలో ఆణిముత్యాలు డ్రామా ప్రదర్శించబడుతుందన్నారు. సోమవారం ఉదయం మహామంగళహారతితో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కనగానపల్లి: మండల కేంద్రంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరానికి వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ అంకే అశోక్ సహకారం అందిస్తున్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి



గ్రామస్తులతో సమావేశమైన ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: ఫ్యాక్షన్‌కు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ పి.శ్రీనివాసులు గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో పల్లె నిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఏవైనా సమస్యలున్నాయా? ఆరా తీశారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు లేవని ప్రజలు తెలిపారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఫ్యాక్షన్ గొడవలతో అలజడి సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామంలో అందరూ ప్రశాంతంగా జీవించాలని సూచించారు. శాంతిభద్రలకు విఘాతం కలిగించొద్దని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కదిరి టౌన్: పట్టణంలోని సయ్యద్ వీధికి చెందిన రెడ్డి బాషా కుటుంబ కలహాలతో ఈనెల 5వ తేదీన పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడు శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా వైఎస్ భారతి జన్మదిన వేడుకలు



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

నల్లమాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మూడు చర్చిల్లో వంద మంది పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. నల్లమాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు టీడీ క్రిష్ణసుమన్ రెడ్డి నిత్యావసర సరుకులు సమకూర్చగా.. ఆయన సోదరుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ పొరకల రామాంజనేయులు, మహిళా విభాగం మండల కన్వీనర్ చిన్నాదేవి, యూత్ విభాగం మండల అధ్యక్షుడు కోనపల్లి నరసింహారెడ్డి, సచివాలయ కన్వీనర్ షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైరు వితరణ

కుటాలపల్లిలో తాగునీటి పథకం బోరుకు రూ.25 వేలు విలువ చేసే విద్యుత్ (కేబుల్) వైరు సమకూర్చినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు టీడీ క్రిష్ణసుమన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.